# న్యాయం

ఇద్దరు అన్నదమ్ములు కలిసి ప్రయాణం సాగిస్తున్నారు; ఒకడు పేదవాడు—రెండోవాడు కలిగినవాడూను. ఇద్దరికీ గుఱ్ఱాలున్నాయి, పేదవాడికి ఆడదీ, భాగ్యవంతుడికి మగగుఱ్ఱమూ! దారిలో చీకటి పడగా నిద్రకోసం మజిలీ చేశారు.

ఆ రాత్రే పేదవాడి గుఱ్ఱం పిల్లనుపెట్టింది. గుఱ్ఱపుపిల్ల దొర్లుకుంటూ భాగ్యవంతుడి బండికిందికి చేరింది. మర్నాడు తెల్లారగానే భాగ్యవంతుడు పేదవాడిని నిద్ర లేపుతూ అన్నాడు. 'చూడరా భాయీ, నా బండి రాత్రి గుఱ్ఱం పిల్లను పెట్టింది.'

పేదవాడు లేచి కళ్ళు నులుముకుంటూ 'బండి గుఱ్ఱం పిల్లను పెట్టడమేమిటి? నా గుఱ్ఱం యీని వుంటుంది' అన్నాడు.

'నీ గుఱ్ఱమే యీనినట్లయితే, యీ పిల్ల దానిప్రక్కనే వుండాలి కదా!'—ఈ ప్రకారం యిద్దరూ వాదులాడుకుని న్యాయస్థానానికి వెళ్లారు. భాగ్యవంతుడు జడ్జీలకు డబ్బు చూపాడు. పేదవాడికి నిజం తప్ప మరో హంగు లేదు.

చిట్టచివరకు ఈ వాదు, ప్రభువు దాకా వెళ్ళింది. ప్రభువువారు అన్నదమ్ములిద్దర్నీ పిలిచి వాళ్లకు నాలుగు సమస్యలిచ్చారు—"బాగా బలిష్ఠమయినదీ, వేగంకలదీ ఏమిటి? బాగా లావయిన దేమిటి ? మాంచి మృదువయిన దేమిటి? ప్రపంచంలోకల్లా ప్రియమైన దేమిటి?"

వీటికి జవాబులు చెప్పడానికి మూడు రోజులు గడువిచ్చారు. నాలుగోనాడు వొచ్చి యిద్దర్నీ తమ తమ జవాబులు చెప్పమన్నారు.

'విరించి'

భాగ్యవంతుడు కాసేపు ఆలోచించి, తన భార్యదగ్గరికి వెళ్ళాడు. ఆమె యితన్ని చూస్తూనే 'యేమిటది, విచారంగా వున్నావు?' అని అడిగింది. ప్రభువువారు యిచ్చిన నాలుగు సమస్యలూ భార్యతో చెప్పాడు ధనికుడు.

'యివీ ఒక సమస్యలేనా, జవాబులు చెబుతాను చూడు, బలిష్ఠమయిందీ, వేగంకలదీనా—యింకేమిటి నీ గుఱ్ఱమే-దానికో కొరడెబ్బ యిస్తే ఒకటే దౌడుతీస్తుంది. ప్రపంచంలోకల్లా లావయినదా-మన దగ్గరున్న రెండేళ్ల పంది! అది చూడు ఎంత లావుందో, నింపోలేదు కూడన్లు-మెత్తనిది...పక్షియీకల పరుపు! అంతకన్నా యింకేమై వుంటుంది కనక? చూచావా-పోతే యిక నాలుగోది ప్రపంచంలోకల్లా ప్రియమైనది—మన మనమడే నయ్యా, మరేమీ కాదు...'

'మంచులా విడిపోయిందీ సమస్య' అని భాగ్యవంతుడు మహా సంతోషించాడు.

ఇక బీదవాడు విచారంగా యింటికి చేరుకున్నాడు. గుమ్మంలో ఎదురైంది ఏడేళ్ల కూతురు—అతని కుటుంబమల్లా యీ పిల్లే-అడిగింది. 'ఏమిటినాన్నా, విచారం?'

బీదవాడు చెప్పాడు.

'ఆ సమస్యలేమిటో చెప్పు'

'బలిష్టమయినదీ వేగమయినదీ యేమిటి?'

'గాలి-గాలి అని చెప్పు నాన్నా!' అన్నది కూతురు.

'లావయిన దేమిటి?'

'మట్టి'

'మృదువయినది?'

'మానవుడి చెయ్యి-ఎంచేతంటే ఎక్కడ పడుకున్నా చెయ్యి తల కింద పెట్టుకుంటే హాయిగా వుంటుంది-',

'ప్రియమైనది?'

'నిద్ర-'

నాలుగోనాడు అన్నదమ్ములిద్దరూ ప్రభువువారి దగ్గరికి వెళ్లారు. జవాబులు విన్నాక ప్రభువు బీదవాడి నిలా ప్రశ్నించారు-'ని అంతట నువ్వే జవాబులు తెల్సుకున్నావా లేక ఎవరయినా చెప్పారా?'

'అయ్యా, నాకొక యేడేళ్ల కూతురున్నది. అదే యీ జవాబులు నాకు బోధపరిచింది-'

'ఆ! నీ కూతు రంత తెలివిగల

దయితే—యిదిగో యీ సిల్కుదారం తీసుకపోయి, నాకు తెల్లారేటప్పటికి చక్కటి జేబురుమాలు నేసి పట్టమ్మను-' అన్నారు ప్రభువువారు.

బీదవాడు సిల్కుదారం తీసుకుని కుంగిపోయి యింటికి చేరుకొన్నాడు. కూతురుతో సంగతి చెప్పాడు.

'నువ్వేం విచారపడకు నాన్నా-' అంటూ ఆ పిల్ల చిప్పకుర్ర ముక్క ఒకటి తెంపి యిచ్చి-'దీంతో ప్రభువువారిని నేత మగ్గం ఒకటి చేయించి పంపమను' అంది. బీదవాడు ప్రభువుదగ్గరికి వెళ్ళి కూతురు మాట్ల మనవి చేశాడు. ఆయన నూటయాభై కోడిగుడ్లు తెప్పించి, బీదవాడికిచ్చి-'యివి తీసుకెళ్లి తెల్లారేసరికి నీ కూతుర్ని కోడిపిల్లల్ని పొదగమను' అన్నాడు.

బీదవాడికి మరింత విచారం కమ్మింది. ఇంటికి వచ్చి కూతురితో 'వీని కంతులేదు—ఒకటి తరవాత ఒకటి...' అన్నాడు. ఏడేళ్ల పిల్ల కోడిగుడ్లను బాగా వండి భోజనంలోకి అమర్చింది. తర్వాత తండ్రిని పిలిచి చెప్పింది. 'ప్రభువువారి దగ్గరికి వెళ్లి కోడిపిల్లలకు ఒకరోజుకు సరిపడ ఆహారం పంపమను. పొలం దున్నటం, గింజలు నాటటం, కంకి మొలవటం, కూర్చార పట్టటం, ధాన్యం తేవటం అంతా ఒక్క రోజులోనే అవాలని చెప్పు. లేకపోతే కోళ్ళు ఆ ఆహారాన్ని ముట్టనయినా ముట్టవు.'

ప్రభువువారు యిది విన్నారు. బీదవాడితో అన్నారు: 'నీ కూతురు అంత తెలివిగలదయితే, రేపుఉదయం యిక్కడికి రమ్మను. వొంటిపై బట్టవుండకూడదు-దిగంబరంగా రాకూడదు. నడిచి రాకూడదు, గుఱ్ఱం ఎక్కి రాకూడదు-కానుక తేరాదు, బహుమానం తేకూడదు-'



బీదవాడు నిలువెల్లా కంపించిపోయాడు. 'ఈపని నా కూతురికి సాధ్యంకాదు-ఈ దెబ్బతో అంతా అయిపోయింది!' అనుకున్నాడు. కాని అతని కూతురు 'నువేం దిగులుపడకు—వెంటనే వేటగాళ్ల దగ్గరికెళ్లి నాకో బతికున్న కుందేలునూ పక్షినీ కొనుక్కురా—'

తండ్రి వాటిని తెచ్చాడు. మర్నాడు ఆ సప్తవర్షిక తన దుస్తులన్నీ విప్పేసింది. చేపలవల వొంటికి చుట్టుకుంది. చేతిలో పక్షిని పట్టుకుంది. కుందేలు మీద కూర్చుంది. ప్రభువువారి దర్శనానికి వెళ్లింది. ప్రభువువారు ఆమెను

# ★ న్యాయం ★

ద్వారందగ్గరే కలుసుకున్నారు. ఆ బాలిక ఆయనకు వొంగి నమస్కారంచేసి 'ప్రభూ, యిదిగో మీకు కానుక-' అంటూ చేతిని ముందుకు చాచింది. ప్రభువు పక్షిని అందుకోబోయాడు, కాని యింతలో అది ఎగిరిపోయింది.

'భేష్ - నే చెప్పినట్లల్లా చేశావు. యిప్పుడు యిది చెప్పు. నీ తండ్రి బీదవాడు కదా— మీ భోజనం ఎట్లా సంపాయిస్తారు-'

'మా నాన్న పొడినేలమీద చేపలవల పరుస్తాడు. అందరిలా నదుల్లోకాదు. నేను ఆ వలలో చిక్కుకున్న చేపల్ని తెచ్చి మా యిద్దరికీ భోజనం తయారు చేస్తాను-'

'పొడి నేలమీద చేపలు పడతాయా? చేపలు నీళ్ళలో కదా వుంటాయి-' అన్నారు ప్రభువు వారు.

'అయితే మహారాజా, బండి గుఱ్ఱంపిల్లను పెట్టినప్పుడు చేపలు పొడినేలమీద తిరగడంలో ఆశ్చర్యం యేమిటి?' అనడిగింది బాలిక.

ప్రభువు వారు గుఱ్ఱపుపిల్లను పేదవాడికి తిరిగి యిప్పించారు. ★

[రష్యా జానపద సాహిత్యంనించి.]




'అనాసిన్'

నాలుగు మందులను కలిగియున్నది.

'అనాసిన్' నాలుగు మందులయొక్క వైజ్ఞానిక మిశ్రమము ఇది నరముల ముఖ్య స్థానములందు తీవ్రమైన మిశ్రమచర్యను జరిపి, నొప్పి, తలనొప్పి, జలుబులు, జ్వరం, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రవిముక్తిని కలిగించును.

1. క్వినైన్: అధిక శక్తి నిచ్చు మరియు జ్వరనివారణ మొదర్చు గుణాలకు ప్రఖ్యాతి గాంచినది, జ్వరాన్ని తగ్గించడంలో మిక్కిలి శక్తిగలది.
2. కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.
3. ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారణి జ్వర నివారణియని ఖ్యాతిచెందినది.
4. ఎసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: తలనొప్పి, మరియు అలాటి బాధలను పోగొట్టుటకు మిగుల ఉపయుక్తమైనది.

ఈ నాలుగు మందులు సరిగ్గా వైద్యునియొక్క ఔషధయోగము వలె పనిచేయును 'అనాసిన్' గుండెకు హాని కలిగించదు, లేక కడుపును అవకతవక చేయదు. నొప్పి, తలనొప్పి జలుబులు, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రంగా సురక్షితమైన మరియు రూఢియైన విముక్తికొరకు ఎల్లప్పుడూ 'అనాసిన్'నే వాడండి.




లక్షలాది మందికి బాధావిముక్తిని కలిగించును

A.43